



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

బాలికల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు

- జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కిశోరి వికాసం ద్వారా బాలికల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కిశోరి వికాసం-వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రణాళిక (మే 2వ తారీకు నుండి జూన్ 10 వరకు)పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం 'కిశోరి వికాసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి 12 అంశాలపై బాలికలకు అవగాహన కల్పించనున్నారని కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఆడపిల్లలు స్కూల్ డ్రాప్ అవుట్‌లు కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. బాలల హక్కుల చట్టం పోక్సో గురించి పూర్తి అవగాహన కలిగించాలని కలెక్టర్ సూచించారు. ఐసిడిఎస్‌తోపాటు డిఆర్‌డిఎ, మెప్మా, విద్య, వైద్య, పోలీసు శాఖలు, ఇంటర్ బోర్డు, ఎస్-ఎస్ఎ, స్కిల్ డెవలప్‌మెంట్, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమం విజయవంత మయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి నిర్మల, డిఎంహెచ్ఒ శాంతికళ, డిసిపిఒ శారద , లీగల్ ఆఫీసర్ శ్రీలక్ష్మి , సామాజిక కార్యకర్త నరసింహులు, కౌన్సిలర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలుచట్టంపై.. మౌనమేలా..?



- చట్టం చేయడంలో సర్కార్ జాప్యం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ గాలికి
- నష్టపోతున్న కౌలు రైతులు

తాము అధికారంలోకి వస్తే కౌలు చట్టంలో మార్పులు చేస్తామని ఎన్నికల ముందు కూటమి సర్కార్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కౌలు చట్టం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో కౌలు రైతులు నష్టపోతున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికల ముందు కొత్త కౌలు చట్టం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీపై మౌనం వహిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మంది వరకూ కౌలు రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. అందరికీ అన్నంపెట్టే కౌలురైతులకు మాత్రం ప్రభుత్వాలు న్యాయం చేయడం లేదు. సాగు చేస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందకుండా చేస్తున్న పరిస్థితి నెలకొంది. అందుకు కారణం కౌలుచట్టంలో ఉన్న లొసుగులే కారణమని చెప్పొచ్చు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ అధీకత సాగుదారుని' చట్టం పేరుతో కౌలురైతులకు ప్రత్యేక చట్టం తెచ్చింది. ఈ చట్టం కౌలురైతులకు కొంతమేర ఉపయోగపడినా పూర్తిస్థాయిలో న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. ఈ చట్టంలో భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేసేవిధంగా నిబంధనలు తెచ్చారు. దీంతో కౌలుకార్డుల ఇవ్వకపోతే కౌలురైతులు, రైతుసంఘాల నాయకులు రెవెన్యూ అధికారులను నిలదీసేవారు. దీంతో కౌలుకార్డులు సాగుదారులకు అందేందుకు కొంత దోహదపడింది. కౌలుకార్డులు అందుకున్న రైతులకు పంటరుణాలు ఇవ్వాలంటూ బ్యాంకుల వద్ద ఆందోళన చేసి కొంతమేర సాధించుకునేవారు. కౌలురైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా కౌలుచట్టంలో మార్పులు చేయాలని కౌలురైతులు, రైతుల సంఘాల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉండేది.

వైసిపి చేసిన చట్టంతో ఉరి

2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కౌలుచట్టంలో మార్పులు చేస్తున్నట్లు చెప్పింది. దీంతో కౌలురైతులకు న్యాయం జరుగుతుందని అంతా భావించారు. వైసిపి 2019లో చేసిన 'ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుని హక్కుచట్టం' కౌలురైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతోనే కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వాలంటూ కొత్తచట్టంలో మార్పులు చేసింది. దీంతో కౌలురైతులకు కౌలుకార్డులు అందని ద్రాక్షగా మారాయి. దీంతో అధికారులు కౌలురైతుల సంఖ్యను తక్కువగా చూపిస్తూ ఏమార్చేందుకు ప్రయత్నాలు చేయడం ప్రారంభించాయి. ఈ చట్టంతో కౌలుకార్డులు అందకపోవడం, బీమా, పంట నష్టపరిహారం వంటి ఏఒక్క ప్రభుత్వ సాయమూ కౌలురైతులకు అందకుండా పోయింది. చివరికి తాను పండించిన పంటను సైతం కౌలురైతులు తన పేరున అమ్ముకునేందుకు వీల్లేకుండా వైసిపి చేసిన చట్టం తయారైంది. దీంతో కష్టాల ఊబిలో కూరుకుపోవడంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. కొత్త కౌలుచట్టంపై తొలుత హడావుడీ..తర్వాత మౌనంతాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తీసుకొచ్చి కౌలురైతులకు న్యాయం చేస్తామని టిడిపి కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలుచట్టం ముసాయిదా తయారు చేసేందుకు అభిప్రాయ సేకరణ పేరుతో జిల్లాల వారీగా కొన్నిచోట్ల సమావేశాలు నిర్వహించింది. శీతాకాల సమావేశాల్లో కొత్త కౌలుచట్టం చేస్తామంటూ హడావుడీ చేసింది. జిల్లాలో సమావేశం ఏర్పాటుకు సంబంధించి రెండు సార్లు తేదీలు ప్రకటించి రద్దు చేసింది. ఆ తర్వాత కౌలుచట్టం ఊసే లేకుండా పోయింది. శీతాకాల సమావేశాలు, బడ్జెట్ సమావేశాలు కూడా ముగిసిపోయాయి. భూ యజమానుల ఒత్తిడి మేరకు కొత్త కౌలుచట్టంపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కౌలుచట్టం చేసి వచ్చే ఖరీఫ్ నుంచి కౌలురైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాల అందేవిధంగా చేస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్త కౌలుచట్టం చేస్తే లబ్ధిపొందే వారిలో జిల్లాలోని రైతులే ఎక్కువగా ఉంటారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంఎల్ఎలు సైతం కౌలుచట్టం గురించి మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.

కొత్త కౌలు చట్టం తీసుకురావాలి



కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని చెప్పి యజమానుల సంతకం ఉన్న వారికే గుర్తింపుకార్డులు ఇచ్చారు. అలా గత ప్రభుత్వం కౌలుదారులందరికీ అన్యాయం చేసింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కొత్త కౌలు చట్టం తీసుకొస్తామని, పక్క భూమి వాళ్ల చెబితే చాలు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకూ కొత్త కౌలు చట్టం తీసుకురాలేదు. పంటలు పండక, పెట్టుబడి కూడా రాక కౌలుదారులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం కౌలు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తోంది తప్ప ఏమీ చేయడం లేదు. గత ప్రభుత్వం లాగేయ ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త కౌలు చట్టం తీసుకురావాలి. కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

కనీస వేతనాలు అమలు చేయాలి

- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు పనిచేస్తున్న డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజి బాబు, తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సలహాదారుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు .తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలకు పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు రంగస్వామి అధ్యక్షతన వహించారు. వారు మాట్లాడుతూ... ఏడేళ్లుగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు పని చేస్తున్న డ్రైవర్లకు రూ.8,800 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, యాజమాన్యం వాటాగా చెల్లించాల్సిన పిఎఫ్ డబ్బులు ఉద్యోగుల దగ్గర నుండే వసూలు చేస్తున్నారని అన్నారు. పిఎఫ్ డబ్బులను యాజమాన్యమే చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వీక్లీ ఆఫ్‌లు, పండగల సెలవు దినాలు, జాతీయ సెలవులు ఏమీ అమలు చేయడం లేదన్నారు. సెలవులు అమలయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలకు అదనంగా చేస్తున్న హైరిస్క్ ప్రెగ్నెంట్ ఉమెన్, సివియర్ ఎనిమిక్ ప్రెగ్నెంట్ ఉమెన్ సేవలకు అదనపు వేతనం చెల్లించాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆరోగ్య బీమా ఎక్స్‌గ్రేషియా ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, గతంలో ఉన్న విధంగా కనీసం రూ.ఏడు లక్షల, ఎక్స్‌గ్రేషియా దహన సంస్కారాలకు ఖర్చులకు చెల్లించాలని కోరారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. వాహన మరమ్మతులను వెంటనే చేపట్టాలని, రిపేర్లకు అయ్యే సొమ్మును యాజమాన్యం ముందుగా చెల్లించాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు వాహన రిపేర్లను యాజమాన్యమే భరించాలని కోరారు. యూనియన్ కార్యదర్శి లోకేష్ ట్రెజరర్ నరేంద్ర రెడ్డి, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ తదితరులు మాట్లాడారు. ధర్నా అనంతరం డిఆర్ఒ వినతి పత్రం అందజేశారు. తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ యూనియన్ నాయకులు హుస్సేన్ పీరా, బ్రహ్మానందరెడ్డి, నాగేంద్రం, మధు, కిరణ్, మురళి, రవి గౌడు, అమర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న యూనియన్ నాయకులు, డ్రైవర్లు

అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు

- యథేచ్ఛగా రహదారి పనులకు తరలింపు - అనుమతులు లేవంటున్న అధికారులు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు మండల పరిధిలో సమీప గోరంట్లగట్టు నుంచి యథేచ్ఛగా ఎర్రమట్టి తరలిపోతోంది అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జెసిబిలతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఏ అధికారికి కనిపించకపోవడం పలు అనుమానాలకు, ఆరోపణలకు తావిస్తోంది. ఇదేఅదునుగా గ్రామానికి చెందిన నాయకులు అక్రమంగా రవాణా చేసి రూ.లక్షలు గడిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

ఎర్రమట్టి తరలించాలంటే రెవిన్యూ, మైనింగ్‌శాఖ అనుమతి తప్పనిసరి. అలాంటిది నిబంధనలు తుంగలో తొక్కి ఏకంగా ప్రభుత్వ గట్టు నుంచి అక్రమంగా ఎర్ర మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల అనుమతి లేకుండా టిప్పర్లతో మట్టిని గోరంట్ల రహదారి పనులకు తరలిస్తున్నారు. సహజ వనరులు తరలిపోతున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల తీరుపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



పర్మిషన్ పేరుతో బోల్తా కొట్టించే ప్రయత్నం: గట్టు నుంచి మట్టిని తరలించేందుకు అనుమతులన్నీ ఉన్నాయని కాంట్రాక్టర్ పర్మిషన్ పేరుతో బోల్తా కొడుతున్నారు. సాధారణంగా ఎర్రమట్టిని తరలించే క్రమంలో రెవిన్యూ, మైనింగ్ శాఖ అధికారులు మట్టి తవ్వుతున్న చోట కొలతలు తీసి క్యూబిక్ మీటర్ ప్రకారం లెక్కలు విధించి, రాయల్టీ చెల్లించాలి. రాయల్టీ చెల్లించకపోవడం చట్ట విరుద్ధం. అనుమతులు లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలించడం వలన ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి పడుతోంది. రెవిన్యూ మైనింగ్ అధికారులు మేల్కొని వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు రైతులు కోరుకుంటున్నారు. గోరంట్ల గట్టును అక్రమంగా తరలిస్తూ ఎర్రమట్టి కొంతమంది కమర్షియల్ అవసరాల కోసం తరలిస్తున్నారు. దీని వల్ల అక్రమంగా సహజ వనరులు తరలిపోవడమే కాకుండా ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ రూపంలో సొమ్ము అందకుండా పోతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాల్టా చట్టానికి తూట్లు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సహజ వనరులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పగడ్బందీగా 2004లో తీసుకువచ్చిన వాల్టా (వాటర్ ల్యాండ్ ట్రీస్) చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయడం లేదు. కేవలం మాటలకే పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాల్టా ప్రకారం సొంత పొలంలో సైతం సహజ వనరులు, ఎర్రమట్టి ,నీటి కోసం బోర్ల కోసం, చెట్టు తొలగించాలన్న సొంతంగా చేయడానికి వీలులేదు. సంబంధిత శాఖపరమైన రెవెన్యూ, మైనింగ్, అండర్ గ్రౌండ్ వాటర్ రిసోర్స్ డిపార్టుమెంట్ అనుమతులు తీసుకోవాలి. ఇలా కాకుండా స్థానికంగా ఉండే అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. ఇక్కడ తవ్వకాలు అనుమతులకు మించి సాగిపోతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార యంత్రాగం పర్యవేక్షణ లేకపోవడం తవ్వకాల ప్రాంతంలో పగలు రాత్రి తీయడం లేకుండా ట్రక్కులు ,ట్రాక్టర్లతో మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

అనుమతులు ఇచ్చే అధికారం మాకు లేదు

- కోడుమూరు తహశీల్దార్ వెంకటేష్ నాయక్



గోరంట్ల గట్టు నుంచి మట్టిని తరలించేందుకు ఎవరికి కూడా అనుమతి ఇవ్వలేదు. అనుమతి ఇచ్చే అధికారం మాకు లేదు. మైనింగ్ అధికారులు చూస్తారు. ఏదయినా చెక్ చేయడం అనుమతులున్నాయా లేదా అని మాత్రం తెలుసుకుంటాం. విఆర్ఒను పంపి విషయాలు తెలుసుకుంటాం. అవసరమయితే మాశాఖనుంచి చర్యలు తీసుకుంటాం.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

- కోడుమూరు సిఐ తబ్రేజ్



అక్రమంగా మట్టిని తరలిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. సెలవులలో ఉన్నందున ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదు.



పసుపుల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బీహార్‌సర్పంచుల బృందం

పసుపులలో బీహార్ సర్పంచుల బృందం పర్యటన

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం పసుపుల గ్రామపంచాయతీలో జాతీయ గ్రామీణ అభివృద్ధి , పంచాయతీరాజ్ సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బీహార్ నుండి సర్పంచుల టీంశిక్షణలో భాగంగా పసుపుల గ్రామపంచాయతీ సందర్శించారు. ఈ సంద్భంగా గ్రామ పంచాయతీ స్వంత ఆదాయ వనరులు, గ్రామ పంచాయతిలో 15వ ఆర్థిక సంఘం నిధుల నిర్వహణ, గ్రామ పంచాయతీల ద్వారా చేప్పట్టిన కార్యక్రమాలు, ఎస్‌డబ్ల్యుపిసిషెడ్డు నిర్వహణ, గ్రామ పంచాయతీ పుస్తకాల నిర్వహణ, గ్రామ పంచాయతీలో అన్ని రకాల లైన్ డిపార్టుమెంట్స్ సమన్వయం తదితర అంశాలను గురించి వారు అడిగి తెలుసుకున్నారు. పై విషయాలపై బీహార్ నుండి వచ్చిన సర్పంచులు అందరూ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ పర్యటనలో భాగంగా ఎన్ఐఆర్‌డి నుండి శశిరేఖ, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రఘునాథ్, డివిషనల్ పంచాయతీ అధికారి లక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ డిపిఆర్‌సి మంజుల వాణి, పసుపుల గ్రామపంచాయతీ సర్పంచి బొగ్గుల. శీలమ్మ, పసుపుల గ్రామ పంచాయితీ కార్యదర్శి హేమంత్ కుమార్ రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జిగా జోష్ణ

ప్రజాశక్తి-పత్తికొండ



పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జిగా జోష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు వై.మధు బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా న్యాయ వాదులు కృషి చేయాలని జస్టిస్ జోష్ణ సూచించారు. తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్, కోశాధికారి సూరజ్ నబి, లైబ్రరీ సెక్రెటరీ నరసరావు, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మన్న, సత్యనారాయణ, పంపాపతి, మైరాముడు, నాగభూషణ రెడ్డి, హులైన్న, కృష్ణయ్య, మహేష్, శ్రీకాంత్ రెడ్డి, రమేష్‌బాబు, నరసింహయ్య, శ్రీనివాసరెడ్డి, రంగస్వామి, హరికృష్ణ, బి.మధు, కబీర్‌దాస్, నెట్టేగళ్ళు చంద్రశేఖర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద కార్పొరేట్లను అడ్డుకుందాం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఓల్డ్‌సిటీ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్

139 ఆమేడే స్ఫూర్తితో మతోన్మాద కార్పొరేట్‌ను అడ్డుకుంటామనే నినాదాలతో వాడవాడలా ఎర్రజెండా పండుగ నిర్వహించారు. సిఐటియు ఓల్డ్‌సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, కర్నూలు సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 139వ కార్మిక దినోత్సవం సందర్భంగా 52 జెండాలు విష్కరణలు చేశారు. అనంతరం రాత్రి జొహరాపురంలో జరిగిన బహిరంగ సభకు ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎంఎ. గఫూర్ మాట్లాడారు. కార్మికులు ఎనిమిది గంటల పనివిధానం అమలు కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కాలరాస్తూ పేద బడుగు బలహీన వర్గాల కార్మికుల సంబంధించిన 44 చట్టాలను నాలుగు కోడ్లుగా చేసి వారి హక్కులను హరించి వేస్తున్నారని విమర్శించారు. మోడీ తన పదకొండు సంవత్సరాల పాలనలో పేదల పై భారాలు వేసి కార్పొరేట్ బడా బాబులకు కేంద్రంలోని ఆస్తులన్ని అతి చౌకగా వారికి అప్పజెబుతున్నారని చెప్పారు. మేక్ ఇన్ ఇండియా మేడిన్ ఇండియా పేరుతో దేశంలో ఉత్పత్తి రంగాన్ని పెంచుతామని ప్రచారం చేసుకుంటూ దేశ ఆర్థిక వ్యవస్థ నష్టపోయే రకంగా విదేశీ వస్తువులను దిగుమతి చేసుకొని దేశ ఉత్పత్తి రంగాలను నష్టం చేస్తున్నారని విమర్శించారు. సబ్‌కా సాత్ దేశ్ కా వికాస్ అంటూ వ్యవసాయాన్ని నష్టం చేసే విధంగా మూడు నల్ల చట్టాలను తెచ్చి రైతులతో చావు దెబ్బ తిన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం, రైతు పోరాటాల దాటికి తట్టుకోలేక తమ తప్పను ఒప్పుకొని దొడ్డిదారిన క్షమాపణలు చెప్పారని అన్నారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు కావాలని కార్మికులు డిమాండ్ చేస్తూ ఉంటే భవన నిర్మాణ కార్మికులకు ఉన్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూన్నారని గుర్తు చేశారు. మోటార్ వాహనాల కార్మికులను రోడ్డు భద్రత చట్టం పేరుతో వాళ్లను ముద్దాయిలుగా చేస్తూ శిక్షలు పడే విధంగా లేదా డబ్బులు కట్టే విధంగా చట్టాలు మార్చారన్నారు. ఈ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు డి గౌస్ దేశాయ్, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు పి.నిర్మల, సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్, నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి మెహమూద్, నగర కోశాధికారి రామకృష్ణ సివిల్ సప్లయ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ, నగర సహాయ కార్యదర్శి నాగస్వాములు నగర్ ఉపాధ్యక్షులు సోల్మన్ రాజు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కాజా పాషా, వీడియో వర్కర్స్ యూనియన్ నాయకులు ఇక్బాల్ హుస్సేన్, చిన్నగా పరిస్థుల సంఘం నాయకులు ఎస్ఎండి షరీఫ్ , కార్మికులు పేద ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఇ.రాజు, లోకేష్, బత్కన్న , నోమేశ్వరి, సుబ్బరాయుడు, లక్ష్మి, నాగ స్వాములు ,సరిత బాలన్న , అక్షయ, రాంబాబు, బృందం విప్లవ గీతాలు, ప్రభుత్వ విధానాలపై గేయాలు, ఎర్రజెండా, కార్మిక గీతాలు, నృత్య రూపకాలు ప్రదర్శించి ప్రజలను ఆకట్టుకున్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఎఐటియుసి, సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న ఎండి.అంజిబాబు, వేదికపై మునెప్ప తదితరులు

ఈనెల 20న దేశవ్యాప్తంగా జరుగు కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప కార్మికులకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదానికి సిఐటియు కార్యాలయం కార్మిక కర్షక భవన్‌లో కేంద్ర కార్మిక సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి నుండి కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. సిఐటియు నగర అధ్యక్షులు నరసింహులు, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి నాలుగు లేబర్ కోట్లను రూపొందించారన్నారు. లేబర్ కోడ్లు కనుక అమలు అయితే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వారన్నారు. లేబర్ కోడ్లు పార్లమెంటులో చట్టరూపం దాల్చినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయకుండా కార్మిక వర్గం ఐక్యమత్యంతో తిప్పి కొట్టిందని, ఈనెల20న సమ్మె ద్వారా లేబర్ కోడ్లు రద్దు అయ్యే విధంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ సమ్మె జయప్రదానికి ఈనెల 6న ఎఐటియుసి కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. సమ్మె జయప్రదానికి కావలసిన ప్రణాళికను ఆ సమావేశంలో రూపొందించాలని సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి నుండి రాజు, సురేష్ నాయక్, సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిబాబా, విజయ్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




తైక్వాండో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

క్రీడల సాధనతో ఏకాగ్రత

తైక్వాండో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థుల్లో క్రమశిక్షణ ఏకాగ్రత పెరగాలంటే క్రీడలకు మించిన సాధనం మరొకటి లేదని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు పెద్ద మార్కెట్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణమండపంలో కరాటే సీనియర్ శిక్షకులు టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి తైక్వాండో శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులకు మంచినీటిని వినియోగించేందుకు వీలుగా వాటర్ బాటిల్లను పంపిణీ చేశారు డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో చిన్నారులు ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడలను సాధన చేయాలని, దీనిపై అటు శిక్షకులు, ఇటు తల్లిదండ్రులు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థులు క్రీడలు సాధన చేయడంతో పాటు పరిశుభ్రమైన ఆహారం, పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని సూచించారు. క్రీడల్లో సాధన చేయడం వల్ల విద్యార్థుల్లో యోగా, ఏకాగ్రత ,మెడిటేషన్, ప్రాణాయామం వంటి ఆరోగ్యానికి ఉపయోగపడే అంశాలు మిళితమై ఉంటాయన్నారు. క్రీడల్లో సాధన చేసే విద్యార్థులు కూరగాయలు ,పండ్లను ఎక్కువగా తీసుకోవాలన్నారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగానికి క్రీడాకారులు దూరంగా ఉండాలన్నారు. క్రీడల సాధన వల్ల ఊబకాయం ,రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఉంటాయని చెప్పారు.



గుజ్జుల వారి పెళ్లి సందడిలో కోట్ల హర్ష, సతీష్

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ లోని గుజ్జుల వారి పెళ్లి సందడిలో మాజీ కూడా చైర్మన్ కోట్ల హర్ష వర్ధన్ రెడ్డి, వైసిపి కోడుమూరు ఇంచార్జి ఆదిమూలపు సతీష్ లు శుక్రవారం నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడే మండలంలోని నాయకులు, కార్యకర్తలు సచివాలయ మాజీ మండల కన్వీనర్ తులసిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ హారోన్, బావికాటి మద్దిలేటి, టిజి. వెంకటేష్ ఎస్ఎంబాషా, గోపాల్, సోమ శేఖర్ రెడ్డి తదితరులు వారికి ముందుగా స్వాగతం పలికారు. అనంతరం పెళ్లిలో పాల్గొని సందడి చేశారు.



ఆస్పరిలో బుక్ లెట్లను విడుదల చేస్తున్న ఎంపిడిఒ

'కిశోర వికాసం' ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి

కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్ ద్వారా విద్యార్థులకు కిశోర వికాసం శిక్షణ తరగతులు ఎంపిడిఒ గీతావాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ నెల 2 నుంచి జూన్ 10 వరకు జిఎంఎస్‌కెయు ఆధ్వర్యంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్‌లో భాగంగా ఆస్పరిలోని అంగన్వాడీ కేంద్రం-2లో 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఎదురయ్యే సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమం పూర్తయ్యే వరకు మహిళా పోలీసులు, ఆశావర్కర్లు,



దేవనకొండలో

ఎఎన్ఎంలు, విఒఎలు ఉంటారన్నారు. అనంతరం కిశోర్ వికాస్ సమ్మర్ శిక్షణ బుక్ లెట్లు విడుదల చేశారు. సూపర్‌వైజర్ సునీత, మహిళా పోలీసులు కవిత, మమత, ఎఎన్ఎం పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు విశ్వకుమారి, రాధమ్మ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు. **దేవనకొండ** అంగన్వాడీ కేంద్రం-6లో కిశోర వికాస వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శివలింగమ్మ అధ్యక్షతన ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సిడిపిఒ మద్దమ్మ, వెలుగు ఎపిఎం నరసన్న పాల్గొని పలు అంశాలను వివరించారు. బాలికలకు రుతుస్రావంలో వచ్చే సమస్యలు, లైంగిక విద్య, బాల్య వివాహాల నివారణ, లింగ వివక్షత, పౌష్టికాహార ప్రాముఖ్యత తదితర అంశాలను బాలికలకు తెలిపారు. జూన్ 10 వరకు కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, వెంకటలక్ష్మి, ఎర్రమ్మ, కులుసుంబ, హుస్సేనమ్మ, మమత పాల్గొన్నారు.

బిలేహాల్‌లో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - హాలహర్వి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విరుపాక్షి

మండలంలోని బిలేహాల్ గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సవారమ్మ ఆలయంలో దీక్ష హోమం, యంత్ర ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్టాపన, మహా పూర్ణాహుతి నిర్వహించినట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి హాజరయి పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయానికి తనవంతుగా రూ.10 వేలు అందించారు. అమ్మ వారి విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపనకు మొదటిరోజు బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రతిష్టాపనోత్సవంలో భాగంగా బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో గోపూజ, గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, కంకణ ధారణ, పుణ్యాహవచనం, గణపతి హోమం భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే గురువారం మహాస్నపనం, 108 కలశాలతో అభిషేకం, ప్రధాన హోమాలు నిర్వాహకులు నిర్వహించారు. శుక్రవారం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

రోడ్డు మరమ్మతుపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కమిషనర్ గారూ... రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని గాంధీ నగర్‌లో స్టేట్ బ్యాంకు నుంచి ఆదోని బైపాస్ రోడ్డుకు వెళ్లే దారిలో డ్రెయినేజీ నిమిత్తం రోడ్డు మరమ్మతులు ప్రారంభించారు. దానిపై ఉన్న బండలను కూడా తొలగించారు. ఆ దారి గుండా నిత్యం వాహనాలు పోతుంటాయి. గత వారం రోజులుగా మరమ్మతుల కోసం తొలగించిన బండల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 40 శాతానికి పైగానే రోడ్డు మరమ్మతు నిమిత్తం ఉన్నది. 60 శాతం వచ్చి పోయే వాహనాల వల్ల ఎదురెదురు వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. వెంటనే మరమ్మతులు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.



మరమ్మతులకు గురైన రోడ్డు

భూ తగాదాలే కారణం...

- లక్ష్మి నారాయణ హత్య కేసు నిందితుల అరెస్టు
- అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

ప్రజాశక్తి - ఆలూరు

భూతగాదాలే లక్ష్మినారాయణ హత్యకు కారణమని అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా తెలిపారు. శుక్రవారం ఆలూరు పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ జి.హుస్సేన్ పీరా, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య మాట్లాడారు. గుంతకల్ పట్టణంలోని భూ తగాద వ్యవహారాల వల్లే ప్రత్యర్థులు పథకం ప్రకారం కాంగ్రెస్ ఆలూరు ఇన్‌ఛార్జీ, ఎంఆర్‌పిఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మి నారాయణను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఈ హత్యలో పెద్దన్న, గౌసియా, రాజేష్ ముఖ్య పాత్ర పోషించారని చెప్పారు. 10 మంది నిందితులను గుర్తించగా అందులో గుంతకల్లుకు చెందిన ముగ్గురు పూనుకొండ్ల రాజేష్, బేపర్ గౌసియా, కత్రిమల సౌభాగ్యను అరెస్టు చేశామని తెలిపారు. గత కొన్నేళ్లుగా గుంతకల్లులో ఎంఆర్‌పిఎస్ కార్యాలయం ఏర్పాటు చేసుకొని కార్యకలాపాలు కొనసాగించేవారని చెప్పారు.

● హత్యకు గల కారణాలు

గుంతకల్లులోని ఆలూరు రోడ్డు మార్గంలో గాయత్రీ ఫంక్షన్ హాలులో 1.10 ఎకరాల ఇళ్ల స్థలాల్లో పూనుకొండ్ల రాజేష్, గౌసియా, లక్ష్మినారాయణ మధ్య వివాదం నడుస్తోంది. సిద్ధార్థ కాలనీలో 9 ఎకరాల దేవదాయ భూమిలో 4 ఎకరాలు ప్లాట్లు వేసి లక్ష్మి నారాయణ విక్రయించినట్లు గౌసియా తెలిపారు. పెద్దన్న భార్య సౌభాగ్యకు సంబంధించి చిప్పగిరిలో 8 ఎకరాల పొలాన్ని లక్ష్మినారాయణ పాసు పుస్తకాలు అత్త పేరుపై మార్చుకున్నారని చెప్పారు. నిందితులపై లక్ష్మి నారాయణ ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టినట్లు, తదితర వివాదాలతో ఎలాగైనా లక్ష్మినారాయణను హత్య చేయాలని రెండు నెలల క్రితం టిప్పర్‌ను కొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

● హత్య విధానం

హత్య సంఘటనకు 15 రోజులకు ముందు లక్ష్మినారాయణను హత్య చేసేందుకు పెద్దన్న ఆధ్వర్యంలో రెక్కి నిర్వహించారు. రాత్రి కావడంతో వదిలేశారు. గత నెల 27న లక్ష్మినారాయణను హత్య చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. లక్ష్మినారాయణ కార్యాలయం నుంచి చిప్పగిరికి బయల్దేరగా ఆయన కారును రాజేష్ అనుసరిస్తూ వచ్చారు. రైల్వే బ్రిడ్జి వద్ద టిప్పర్‌లో డ్రైవర్ మేకల శ్రీనివాసులు, ధర్మ ఉన్నారు. రాము మార్గమధ్యంలో ఉండి లక్ష్మి నారాయణ ఇన్నోవా కారు కదలికను టిప్పర్ డ్రైవర్‌కు ఫోన్‌లో చేరవేశారు. మిగిలిన నిందితులు అప్పటికే రైల్వే బ్రిడ్జి వద్ద పెద్దన్నతో కలిసి మకాం వేశారు. రైల్వే బ్రిడ్జి దగ్గరకు రాగానే టిప్పర్‌తో ఢీకొట్టారు. కారు నుజ్జునుజ్జయి లక్ష్మి నారాయణ బయటికి రాలేని పరిస్థితిలో ఉన్నారు. ఒక్కసారిగా పెద్దన్న, వడ్డే నవీన్ కారు అద్దాలు పగులగొట్టి తలపై వేట కొడవలితో దాడి చేసి హతమార్చారు. మిగిలిన నిందితులు మనోహర్, గోవిందు సంఘటన స్థలానికి ఎవరూ రాకుండా జాగ్రత్త వహించారు. ప్రమాదంలో కారు డ్రైవర్‌గా ఉన్న కొడుకు వినోద్ కళ్లు తిరిగి పడిపోవడంతో చనిపోయారని, కారు వెనుకాల ఉన్న కరెంట్ గోవిందును గుర్తించలేక అక్కడి నుంచి నిందితులు పారిపోయినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

● ఫిర్యాదులో ఉన్న వారిపై విచారణ

మృతుని బంధువుల ఫిర్యాదులో వైకుంఠం శివ ప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, అరికేర మల్లేష్, చికెన్ రామాంజినేయులుపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. లక్ష్మినారాయణ హత్య కేసులో వీరికి ఎటువంటి పాత్ర లేదని దర్యాప్తులో తేలిందన్నారు. అరెస్టు అయిన ముగ్గురు నిందితులను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. మిగిలిన ఏడుగురిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. సిఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐలు దిలీప్ కుమార్, శ్రీనివాసులు, మహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

- నెలలోనే రూ.3.96 కోట్లు వసూలు

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే సకాలంలో ఆస్తి, నీటి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. గత ఏప్రిల్ 1 నుంచి 30 వరకు రూ.3.96 కోట్ల పన్నులను ప్రజలు చెల్లించారని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.15 కోట్లు లక్ష్యంగా ఉండగా రూ.12.96 కోట్ల వసూలు చేయించామని చెప్పారు. అలాగే తాజాగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి 2025-26 గాను రూ.22 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు రూ.3.96 కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను వాటి అభివృద్ధి కోసమే ఉపయోగించాలని, అందుకు ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం 5 శాతం వడ్డీ మినహాయింపు ఇచ్చిన మేరకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. అలాగే రికార్డు స్థాయిలో మే నెల పింఛన్ల పంపిణీ జరిగిందని చెప్పారు. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. త్వరలోనే 54 పనులకు టెండర్లు పిలుస్తామన్నారు.

పిల్లలూ.. జర భద్రం..!

- వేసవి సెలవుల్లో పిల్లల పట్ల జాగ్రత్తలు అవసరం
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లలు.. ఇప్పుడు ఆకాశాన్ని తాకేంత ఉత్సాహంతో ఉంటారు. ఇన్నాళ్లూ నాలుగు గోడల మధ్య ఊపిరి ఆడలేదని అనుకుంటూ... స్వేచ్ఛగా గాలి పీల్చుకునేందుకు పరిగెడుతుంటారు. ఈ క్రమంలో ఎటు వెళ్తున్నారో కూడా తెలియకుండా తిరిగేసి, ప్రమాదాలు కొని తెచ్చుకునే అవకాశం ఉంది. తల్లిదండ్రులు కచ్చితంగా ఓ కంట కనిపెడుతూ ఉండాల్సిందే..!

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం అనుకుంటూ కొందరు, చాలా కష్టంగా పిల్లలందరూ పాఠశాలకు వెళ్తుంటారు. సంవత్సరం పాటు ఉపాధ్యాయుల దండనలు, హోం వర్కుల భారాలు భరించలేక విసిగిపోయినట్లు భావిస్తారు. ప్రస్తుతం స్వేచ్ఛగా విహరించేందుకు ఎంతగానో ఉవ్విళ్లూరుతుంటారు. కొందరు బంధువుల ఇళ్లకు పయనమైతే, మరికొందరు సమ్మర్ క్యాంపుల్లో



సెలవులకు ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

చేరిపోతారు. ఇంకొందరు ఇంట్లోనే సందడి చేస్తుంటారు. ఎవరు ఎక్కడ ఉన్నా.. ప్రమాదాల తీవ్రత తెలియని పిల్లలు అపాయాల బారిన పడే అవకాశం ఉంటుంది. పెద్దలు వారిని కనిపెట్టుకుంటూ ఉండి తీరాల్సిందే. స్వేచ్ఛనిస్తూనే కాస్త కట్టడి చేయాల్సి. లేదంటే.. ఒక్కోసారి ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. తర్వాత ఎంత బాధపడినా ప్రయోజనం ఉండదు. వేసవి సెలవుల్లో పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

చెరువుల్లో, బావుల్లో ఈతలు వద్దు

గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లోని పిల్లలు బావుల్లో, చెరువుల్లో ఈతకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎండ వేడిని తట్టుకోలేక కొందరు పెద్దలు వెళ్తుంటే.. వారి వెంట పిల్లలు కూడా వెళ్లే అవకాశం ఉంటుంది. పక్కన ఉన్న వాళ్లు వీరిని ఎంత జాగ్రత్తగా చూసుకుంటారనేది చెప్పలేం. ఒకవేళ చూసుకున్నా.. ఈత రాకుండా బావుల్లోకి, చెరువుల్లోకి దిగడం అత్యంత ప్రమాదం. ఈత రాని పిల్లలను పంపకండి. అవకాశం ఉంటే మీరే తీసుకెళ్లండి. ఈత నేర్పండి. అది అవసరం కూడా. కానీ ఒంటరిగా పంపవద్దు.

బైక్ ఇవ్వకండి

పట్టణాలు, నగరాల్లోని పిల్లలు వాహనాలతో ఎక్కువగా అనుబంధం కలిగి ఉంటారు. పక్కవారిలా తామూ రయ్యిమంటూ దూసుకెళ్లాలని ఆశపడుతుంటారు. ఈ సెలవుల్లో ఎలాగైనా బైక్ నడపడం నేర్చుకోవాలని మారాం చేస్తుంటారు. అవకాశం ఉంటే మీరే నేర్పండి. లేదంటే తర్వాత నేర్పిస్తానని చెప్పండి. అంతేగానీ మీరు లేకుండా బండి చేతికి ఇవ్వకండి.



చెప్పి వెళ్లమనండి

ఈ రోజుల్లో పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియదు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారు అనేది తల్లిదండ్రులకు పెద్దగా తెలియట్లేదు. ఫ్రెండ్స్‌తో వెళ్తామంటే ఎక్కడికి వెళ్తున్నారో కనుక్కోండి. ఎప్పుడు వస్తారో అడగండి. మానిటర్ చేస్తున్నారని తెలిస్తేనే కాస్త జాగ్రత్తగా ఉంటారు. అలాగని అథారిటీ ఉపయోగించకండి. ఫ్రెండ్లీగా ఉంటూనే విషయాలు తెలుసుకోవాలి.

ఎండకు వద్దు

ఎండలో గడపడం అనేది ఎంత ప్రమాదమో పిల్లలకు తెలియదు. వడ దెబ్బ ఏకంగా ప్రాణాలనే మింగేస్తుంది. మధ్యాహ్నం ఎండలో ఆడనివ్వకండి. నీడలోనే ఆడేలా చూడండి. తప్పకుండా తగినన్ని నీళ్లు తాగేలా చూడాల్సిన బాధ్యత పెద్దలదే. ఇది కేవలం సమ్మర్ కోసమే కాదు.. భవిష్యత్తులో కిడ్నీ సమస్యలు రాకుండా కూడా కాపాడుతుంది.

మొబైల్ ఫోన్లు

ఎటూ వెళ్లనివ్వట్లేదని కొందరు.. ఎటూ వెళ్లేది లేదని ఇంకొందరు.. ఫోన్లో మునిగిపోయే అవకాశం ఎక్కువ. వాటికి బానిసలు కాకుండా చూడండి. ఫోన్ వాడటానికి టైమ్ పెట్టండి. ఇంతసేపే వాడాలని, ఆ తర్వాత బొమ్మలు వేసుకోవడమో, ఇండోర్ గేమ్స్ ఆడుకోవడమో చేయాలని చెప్పండి.

అగ్ని ప్రమాద వస్తువులు

చిన్న పిల్లలు ఇంట్లో ఉంటే అన్నీ గెలికేస్తుంటారు. ప్రమాదకరమైన వస్తువులు వారి చేతికి అందకుండా చూడండి. అగ్గిపెట్టెలు, లైటర్లు వంటి అగ్నిప్రమాద కారక వస్తువులను దూరంగా ఉంచండి.

విషపూరితాలు

ఇంటిని శుభ్రపరిచే మందులు కావొచ్చు, పంటల కోసం వాడే మందులు కావొచ్చు.. ఇంట్లో విషపూరిత పదార్థాలు ఏవైనా ఉంటే వాటిని పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోండి లేదంటే.. వాటిని తినే అవకాశం ఉంటుంది.

కిటికీలు, తలుపులకు లాక్

పిల్లలు ఇంట్లో కిటికీలు, తలుపులు పట్టుకొని వేళాడుతుంటారు. మరికొందరు బాల్కనీలోనూ ఆడుతుంటారు. ఈ క్రమంలో కాళ్లు, చేతులకు దెబ్బలు తగలడం.. లేదంటే పైనుంచి కిందపడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. తలుపులు, కిటికీలు లాక్ చేయండి.

నీటి సంపుల దగ్గర జాగ్రత్త

ఇళ్ల వద్ద నీటి సంపులుంటే తప్పనిసరిగా వాటిపై మూతలు ఉండేలా చూసుకోవాలి. అటువైపు పిల్లలు వెళ్లడానికి అవకాశం లేకుండా చూడాలి. పాఠశాల వద్ద ప్రమాదకర గుంతలుంటే ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి. విరామ సమయంలో పిల్లలను అటువైపు వెళ్లనీయొద్దు.

వారితో గడపండి

ఏడాది పొడవునా పిల్లలు పాఠశాలలో, పెద్దలు ఆఫీసులో, ఇంట్లో ఉండిపోతారు. ఇప్పుడు వారితో గడిపే సమయం వచ్చింది. వారిని అలా వదిలేయకుండా ప్రేమగా వారితో గడపండి. సమయం లేదని చెప్పకండి. మనసుంటే మార్గం ఉంటుంది. వారితో ప్రేమగా ఉంటేనే.. పెద్దలతో బంధం బలపడుతుంది. ఈ జాగ్రత్తలు పాటిస్తూ.. ఈ సమ్మర్‌లో పిల్లలతో ఎంజాయ్ చేయండి. జాగ్రత్తగా ఉండండి.

ఇంటి దగ్గరే ఆటలు



- విద్యార్థి బండి మణిశంకర్, విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్, పెద్దహరివాణం, ఆదోని మండలం

వేసవి సెలవులు వచ్చేశాయి. ఇంటి దగ్గర నుంచి ఆటలు ఆడుకుంటాం.

విద్యార్థులను జాగ్రత్తగా తీసుకోవాలి

- ఎంఇఒ శ్రీనివాసులు, ఆదోని



వేసవిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించింది. ప్రతి విషయంలో విద్యార్థులపై చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

రైల్వే గేటుకు ఇరువైపులా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కోసిగి



స్థానిక రైల్వే గేటుకు ఇరువైపులా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రాముడు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. వేసవి ముగిసే వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తే వాహనదారులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైళ్ల రాకపోకలు రద్దీగా ఉండడంతో తరచూ రైల్వే గేట్ వేయడం వల్ల వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజూ కోసిగి మీదుగా పదుల సంఖ్యలో రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయని, ప్రతి పది నిమిషాలకోసారి రైల్వే గేటు పడడంతో వేసవి కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్పారు. వాహనదారులు వేడిమికి తట్టుకోలేక వడదెబ్బకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వేసవి పూర్తయ్యే వరకు రైల్వే గేటుకు ఇరువైపులా చలువ పందిళ్లు లేదా టెంపరరీ షెడ్లను ఏర్పాటు చేసి ప్రజలను ఎండ వేడిమి నుంచి కాపాడాలని కోరారు.

మంత్రాలయం నుంచి ఇద్దరు పోలీసులు బదిలీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం పోలీసు స్టేషన్ నుంచి ఇద్దరు పోలీసులు బదిలీపై వెళ్లినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. ఎస్పీ, సిఐ రామాంజులు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సాధారణ బదిలీల్లో భాగంగా పోలీసులు రామాంజిని, లక్ష్మణ్‌లు బదిలీపై వెళ్తున్నట్లు చెప్పారు. ఎమ్మిగనూరు టౌన్‌కు రామాంజి, గోనెగండ్ల స్టేషన్‌కు లక్ష్మణ్ బదిలీపై వెళ్తున్నట్లు తెలిపారు. నందవరం మండలం నుంచి మంత్రాలయం స్టేషన్‌కు మధు వచ్చినట్లు తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి

- జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకప్ప

- తెర్నేకల్ పిహెచ్‌సి నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- దేవనకొండ

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి జరుగుతుందని జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 30 పడకల నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ప్రజల మౌలిక వసతుల కల్పనకు, గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో అధ్వానంగా ఉన్న బేతపల్లి, పుల్లాపురం రహదారుల అభివృద్ధిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన వెంటనే ఆ రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. ఎల్లార్తి దర్గా, చిప్పగిరి చారిత్రాత్మక దేవాలయాల టూరిజం, తెర్నేకల్ గ్రామంలో ముత్తుకూరు గౌడప్ప టూరిజం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు. రోడ్లు భవనాల ఇఇ వెంకటేశ్వర్లు, డిఇ శివరుద్ర, జెఇ శ్వేత, వైద్యాధికారులు అరుణ జ్యోతి, వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు చిన్న వెంకప్ప, చిన్న రాముడు, నాగేష్ నాయుడు, తిమ్మప్ప, జనసేన నాయకులు బడేసాబ్, బంగి చంటి, నందు, ఆంథోని, సిపిఎం నాయకులు బజారి, పరమేష్, పరాక్రమ రాముడు, గ్రామ పెద్దలు వెంకట రాముడు, చందమామ రాముడు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ఎట్టకేలకు ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు

గతేడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న తెర్నేకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి మోక్షం లభించింది. 2022వ సంవత్సరం వైసిపి ప్రభుత్వంలో మంజూరైన 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణంలో వైసిపి, కూటమి నాయకుల మధ్య స్థల కేటాయింపుపై వివాదాస్పదం నెలకొంది. ఎట్టకేలకు జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప జోక్యంతో గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి స్థలాల కేటాయింపు మార్చి ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.


వివాహ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని చేకూరి ఫంక్షన్ హాలులో జరిగిన వివాహ వేడుకల్లో ప్రముఖులు సందడి చేశారు. 42వ వార్డు కౌన్సిలర్ సిహెచ్.లోకేశ్వరి, నాగరాజు కుమారుడు తిరుమలేష్, పాండవగల్లు గిడ్డయ్య కుమార్తె అనంతలక్ష్మి వివాహ వేడుక శుక్రవారం కనులవిందుగా సాగింది. ఈ వేడుకకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశులు, సీనియర్ నాయకులు రామాంజనేయులు, ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, గోపాల్, తిప్పన, వీరేష్, వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, జడ్‌పి మాజీ ఛైర్మన్ తిక్కన్న, శ్రీకాంత్ రెడ్డి, బుద్ధారెడ్డి, వెంకటేష్, తిమ్మప్ప హాజరయ్యారు. మున్సిపల్ ఇన్‌ఛార్జీ ఛైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్, వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు బాలాజీ, రాజేశ్వర్ రెడ్డి, యాసీన్, రఘునాథ్ రెడ్డి, పలువురు అధికారులు హాజరయ్యారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న రాధాకృష్ణ



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఉమాపతి నాయుడు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- దేవన కొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి కార్యకర్త వడ్డే తిమ్మప్ప కుటుంబానికి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు రూ.10 వేల ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు చిన్న వెంకప్ప, కోలంట్ల తిమ్మప్ప, వడ్డే పులికొండ, బాట మీద రాజు, దేవేందర్ రెడ్డి, దుమ్ము కిష్టన్న, కోలంట నాగేంద్ర, వీరేష్, కె.శంకర్, మాల రామాంజనేయులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

పలిమారు మఠంలో శ్రీమఠం పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు పలిమారు మఠాన్ని సందర్శించారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం ఉడిపి అష్ట మఠాల్లో ఒకటైన పలిమారు మఠంలో రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు పీఠాధిపతులకు పూజారులు, వేద పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. ఉడిపి శ్రీకృష్ణుని దర్శించుకొని మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పలిమారు మఠం సీనియర్ పీఠాధిపతులు శ్రీవిద్యాధీశ తీర్థులు, జూనియర్ పీఠాధిపతులు శ్రీవిద్యారాజేశ్వర తీర్థుల ఆధ్వర్యంలో (విద్వత్ గోష్టి) పండితుల సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు.

గిరియాచార్యులకు పరవిద్యామాన్య బిరుదు ప్రదానం

శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థుల పూర్వాశ్రమ తండ్రి రాజా ఎస్.గిరియాచార్యులకు పలిమారు మఠం పీఠాధిపతులు విద్యాధీశ తీర్థులు పరవిద్యామాన్య అనే బిరుదుతో సత్కరించారు. పలిమారు మఠంలో జరిగిన పండితుల ఇష్టాగోష్టిలో పాల్గొన్న ఆయనకు ఈ గౌరవం దక్కింది. గతంలో కూడా సంస్కృత భాషలో అనేక గ్రంథాలు రచించి పట్టు ఉన్న నేపథ్యంలో పండిత కేసరి మహామహోపాధ్యాయ, రాష్ట్రపతి ప్రతిభా అవార్డును, డాక్టరేట్‌ను అందుకున్నారు.



పురస్కారం అందుకుంటున్న గిరియాచార్యులు



మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ముజీబ్ అహ్మద్

క్రీడా నైపుణ్యం వెలికి తీయడమే లక్ష్యం

- క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ముజీబ్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో క్రికెట్ క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసేందుకే టోర్నమెంట్లు నిర్వహిస్తున్నామని ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ముజీబ్ అహ్మద్ తెలిపారు. ఆదోని మున్సిపల్ మైదానంలో జరుగుతున్న ఫ్రెండ్‌షిప్ కప్ టోర్నమెంట్ వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు, ఇతర అసోసియేషన్ల జట్లు సంయుక్తంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు పూనుకున్నప్పటికీ సమస్య రాకుండా కేవలం అసోసియేషన్ల జట్ల మధ్య క్రికెట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 16 జట్లు నమోదు చేసుకోగా శనివారం ఫైనల్ నిర్వహించి విజేతలకు మున్సిపల్ ఇన్‌ఛార్జీ ఛైర్మన్ మహ్మద్ గౌస్ చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. త్వరలోనే పోలీసు ఉన్నతాధికారుల సూచన మేరకు అన్ని రాజకీయ పార్టీ నాయకుల క్రికెట్ జట్ల మధ్య టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. ఫ్రెండ్‌షిప్ కప్ టోర్నమెంట్ నిర్వహణపై కొన్ని రూమర్లు వచ్చాయని, వాస్తవం కాదని కొట్టి పారేశారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోండి


- తహశీల్దార్ రామేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆస్పరి

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇళ్లు లేని పేద కుటుంబాలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పేదల కోసం గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. అర్హులైన వారు ఎవరైనా ఉంటే తమ గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బారికేడ్లు ఏర్పాటు చేయాలి : డిఎస్ఎఫ్

ప్రజాశక్తి - ఆదోని



వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఢణాపురం గ్రామంలో ఉన్నత పాఠశాల దగ్గర రోడ్డు మార్గంలో వాహనాల వేగం నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని డిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఢణాపురం ఉదయ్ కోరారు. శుక్రవారం వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఢణాపురం గ్రామంలో ఉన్నత పాఠశాలకు వందల మంది విద్యార్థులు చదువుకోడానికి వస్తున్నారని తెలిపారు. రోడ్డు దాటుకుని వెళ్లాల్సి వస్తుందని, అక్కడ బారికేడ్లు లేనందువల్ల వాహనాలు అతివేగంగా రావడం వల్ల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. పాఠశాల తెరిచేలోపు అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.